**Namaste Telangana**

# టెట్‌లో అర్హతతోనే టీచర్ల ఎంపిక

- డిప్యూటీ సీఎం కడియం
- విద్యార్థులు ఆందోళన చెందనవసరం లేదు
- పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ కిషన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉపాధ్యాయుల నియామకానికి ముందు టీచర్ అర్హత పరీక్ష (టెట్) పరీక్ష నిర్వహణ అనివార్యమని డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి స్పష్టంచేశారు. ప్రస్తుతానికి ఇందులో రెండో అభిప్రాయం ఏమీ లేదన్నారు. జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి (ఎన్‌సీటీఈ) ప్రకారం ఉపాధ్యాయుల ఎంపిక ప్రక్రియలో టెట్ పరీక్షలో అర్హత సాధించాల్సి ఉందన్నారు. ఆ మేరకు ఇప్పుడున్న నిబంధనల ప్రకారం టెట్‌కు 20 శాతం వెయిటేజీ ఇస్తున్నామన్నారు. అదే క్రమంలో టీచర్ రిక్రూట్‌మెంట్ పరీక్షలకు 80 శాతం మార్కుల కేటాయింపు విధానం కొనసాగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల తోపాటు ప్రైవేటు స్కూళ్లలో పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయులు కూడా టెట్‌లో అర్హత సాధించాలని ఆ నిబంధనలు స్పష్టం చేస్తున్నాయన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో టెట్ పరీక్షలను రద్దు చేయాలన్న ఆలోచన లేదని, ప్రభుత్వం నుంచి తమకు ఎటువంటి ప్రతిపాదన అందలేదని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ జీ కిషన్ తెలిపారు. ఈ మేరకు కొన్ని పత్రికలలో వస్తున్న వార్తలను ఖండించారు. ఈ విషయంలో విద్యార్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.